# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 05-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ భారత్, ఫిలిప్పీన్స్ దేశాల మధ్య సంబంధాలు పురాతన కాలం నాటివని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ ఉత్తరాఖండ్‌లో ఈ రోజు సంబంవించిన ఆకస్మిక వరదలతో ఉత్తరకాశిలోని ధరాలి గ్రామం పూర్తిగా దెబ్బతింది.

❖ ప్రతిపక్ష సభ్యుల నిరసనలు గందరగోళం మధ్య ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.

❖ మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగిస్తూ.. రాజ్యసభ తీర్మానాన్ని ఆమోదించింది.

===========================

భారత్, ఫిలిప్పీన్స్ దేశాల మధ్య సంబంధాలు పురాతన కాలం నాటివని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఫిలిప్పీన్స్ అధ్యక్షులు ఫెర్డినాండ్ రొమల్డెజ్ మార్కోస్ జూనియర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో ఈ రోజు న్యూఢిల్లీలో ఇరు దేశాలు 9 ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. వీటిలో భారత్, ఫిలిప్పీన్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, నేర విషయాల్లో పరస్పర చట్టపరమైన సహాయంపై ఒప్పందం, రక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాలలో సహకారం మొదలైనవి ఉన్నాయి. ఈ సందర్భంగా ఉమ్మడి పాత్రికేయుల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. భారత్, ఫిలిప్పీన్స్ తమ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ భారత్ లో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడి పర్యటన ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉందన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం నిరంతరం పెరుగుతోందని నరేంద్ర మోదీ పేర్కొంటూ..

(వాయిస్ 40 సెకన్లు)

===========================

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశిని ఈ రోజు ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. వరదల ధాటికి ఉత్తర కాశి జిల్లాలోని ధరాలి గ్రామం పూర్తిగా దెబ్బతింది. ఈ వరదలలో ఇప్పటివరకూ ఐదుగురు మరణించగా పలువురు గల్లంతైనట్లు

అధికారులు తెలిపారు. గంగానది పరివాహక ప్రాంతమైన ఖీర్‌లో కుంభవృష్టి కురిసిందని, దీంతో వరదలు సంభవించాయని వెల్లడించారు. గ్రామంలోని అనేక నివాసాలు కొట్టుకుపోగా మరికొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎన్‌డిఆర్ఎఫ్ సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఐబెక్స్ బ్రిగేడ్ దళాలు అక్కడికి చేరుకున్నాయని సైన్యం ప్రకటించింది. ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం, సంబంధిత బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రికి ఫోన్ చేసి వరద పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం తరఫున అన్ని రకాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ ఘటనపై స్పందించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో సహాయక చర్యలు జరుగుతున్నాయని.. ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ మొదటి ప్రాధాన్యత అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిపక్ష సభ్యుల నిరసనలు గందరగోళం మధ్య ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. బీహార్‌లో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణల అంశంపై ప్రతిపక్ష పార్టీల నిరసనలతో పార్లమెంటు ఉభయ సభల కార్యకలాపాలు ఈ రోజు పలు మార్లు వాయిదా పడ్డాయి. ఈ అంశంపై చర్చకు ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. లోకసభ ఉదయం 11 గంటలకు సమావేశమైనప్పుడు, కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి సహా ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు నినాదాలు చేస్తూ.. స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టారు. ఈ గందరగోళం మధ్య సభాపతి ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని నడిపించడానికి ప్రయత్నించారు. సభ్యులు ముందస్తు ప్రణాళిక ప్రకారం సభకు అంతరాయం కలిగిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి సరైనది కాదని ఓం బిర్లా అన్నారు. ఈ గందరగోళం కొనసాగుతుండగా, స్పీకర్ సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు లోకసభ సమావేశమైనప్పుడు ప్రతిపక్ష పార్టీల సభ్యులు నినాదాలు చేస్తూ వచ్చారు. ఈ గందరగోళం మధ్యనే గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్ వ్యవస్థీకరణ బిల్లు 2024ను లోకసభ ఆమోదించింది. అనంతరం లోక్ సభ రేపటికి వాయిదా పడింది. రాజ్యసభలో బీహార్ ఎన్నికల జాబితాలో చేపట్టిన ప్రత్యేక సవరణలపై అభ్యంతరాలతో విపక్ష సభ్యులు సభలో నినాదాలు చేయడంతో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ సభను రేపటికి వాయిదా వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగిస్తూ.. రాజ్యసభ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ రోజు ఉదయం, ప్రతిపక్షాల నినాదాల మధ్యన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద రాష్ట్రపతి జారీ చేసిన ఉత్వర్వుల మేరకు మణిపూర్ లో రాష్ట్రపతి పాలన విధించారు. దీని కంటే ముందు లోక్ సభలో జూలై 30న రాష్ట్రపతి పాలనను పొడిగిస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. ఈ రోజు రాజ్యసభలో తీర్మానం ఆమోదించడంతో మరో ఆరు నెలల పాటు అక్కడ రాష్ట్రపతిపాలన కొనసాగనుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉభయ సభల్లో ప్రతిపక్ష పార్టీల నిరంతర గందరగోళంపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈరోజు పార్లమెంట్ ఆవరణలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తరువాత సభ సజావుగా సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపుకు సంబంధించిన చట్టబద్ధమైన తీర్మానం ఆమోదించబడిందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు సహకరించి సభను సక్రమంగా పని చేయడానికి అనుమతించాలని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఈ రోజు న్యూఢిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 79 సంవత్సరాలు. దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పని చేసి ఆయన దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంతాపం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో వినోద రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సమాచార ప్రజా సంబంధాల కార్యదర్శుల జాతీయ సమావేశం ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమర్ధవంతమైన మీడియాతో పాటు ఎంటర్‌టైన్మెంట్ ఎకో సిస్టమ్ ను నిర్మించడంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కీలక పాత్ర పోషించాల్సి ఉందని అన్నారు. ఈ రంగంలో ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని ఆయన గుర్తు చేశారు. వినోద రంగంలో చేపట్టిన సంస్కరణల ద్వారా శక్తివంతమైన సృజనాత్మకతను వెలికి తీసుకుని రావాలన్నది కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ్యమని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సిందూర్ పై పార్లమెంటులో జరిగిన చర్చలో ప్రభుత్వం సమగ్రమైన సమాచారాన్ని అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఢిల్లీలో ఈ రోజు జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశంలో ప్రధానమంత్రి ప్రసంగించారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎన్డీఏ కూటమి ఎంపీలు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... పార్లమెంటులో చర్చల సందర్భంగా ప్రతిపక్షాలు అనుసరిస్తున్న వైఖరిని దేశ ప్రజలంతా గమనిస్తున్నారన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న రెండు రోజులలో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అదే విధంగా తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో కూడా భారీ వర్షాలు కూరుస్తాయని పేర్కొంది. ఇదిలా ఉండగా కేరళలోని కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా ఇడుక్కి, ఎర్నాకుళం, త్రిస్సూర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆ వివరాలను వాతావరణ విభాగం అధికారి ఉమా శంకర్ దాస్ వెల్లడిస్తూ..

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =